



ఘనంగా సహకార

వారోత్సవాలు

ఖమ్మం మార్కెట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం నగరంలోని డీసీసీబీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. బ్యాంక్ ఉద్యోగులు అందరూ సహకార బలోపేతానికి, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాకతీయ సహకార శిక్షణా కేంద్రం వరంగల్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, సీఈవో వెంకటఆదిత్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పరిష్కారానికే

ప్రాధాన్యం

- అన్ని సమస్యలపై చర్యలు చేపడతాం
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో కార్పొరేషన్ కమిషనర్ సుజాత
- హాజరైన అన్ని విభాగాల అధికారులు
- ప్రజల నుంచి విశేష స్పందన.. వెల్లువెత్తిన ఫోన్‌కాల్స్



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ సుజాత

కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను పరిష్కరించేందుకే ప్రాధాన్యమిస్తున్నామని, తాము అదే లక్ష్యంతో ముందు కెళ్తున్నామని కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తమ దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటు న్నామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను ఆమెతో పాటు విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్ ఇన్‌లో కమిషనర్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడారు. ప్రజలు తన దష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అయితే 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఈ ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విషేశ స్పందన వచ్చింది ఉదయం నుంచే ఫోన్ కాల్స్ వెల్లువెత్తాయి. - కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి


ఫోన్ ఇన్ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, వివిధ విభాగాల అధికారులు

ఫోన్ ఇన్‌లో కమిషనర్‌కు అందిన ఫిర్యాదుల్లో కొన్ని... 6

పామాయిల్ విస్తరించాలి

పచ్చదనం పెరగాలి

- 'గిరివికాస్'తో పోడుభూముల్లోనూ పామాయిల్ సాగుకు ప్రోత్సాహం
- జనవరి నాటికి గోద్రెజ్ పరిశ్రమ ట్రయల్‌రన్ పనులు పూర్తవ్వాలి
- అంజనాపురంలో దేశంలోనే మొదటి సీడ్ గార్డెనింగ్ ఏర్పాటు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఫ్యాక్టరీ నిర్మాణ పనుల పరిశీలన
- ఖమ్మం జిల్లాలో పర్యటన.. అభివృద్ధి పనులకు శ్రీకారం


గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొణిజర్ల : పామాయిల్ పంట విస్తరించాలని, తద్వారా సామాజిక అడవుల తరహాలో పచ్చదనం పెరగాలని, ఇందులో భాగంగానే ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొణిజర్ల మండలం అంజనాపురంలో గోద్రెజ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను ఆయన అదనపు కలెక్టర్ శ్రీజ, కంపెనీ ప్రతినిధులు కృష్ణప్రసాద్, చావా వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంజనాపురంలో గోద్రెజ్ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా ఆయిల్‌పామ్ సీడ్‌గార్డెనింగ్ ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. పత్తిమొక్కజొన్న రైతులు కూడా ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని తద్వారా జిల్లాపచ్చదనంతో కళకళాడుతూ తద్వారా రైతులు లాభసాటి వ్యవసాయంలో అడుగుపెట్టాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులకు గిరివికాసం కింద సోలార్ సదుపాయంతో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి ఖమ్మంజిల్లాలో ఆరుమండలాలు, కొత్తగూడెంజిల్లాలో నాలుగు మండలాలను కేటాయించామన్నారు. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కొణిజర్ల మండలం అంజనాపురంలో సీడ్ గార్డెనింగ్ ఏర్పాటుకు గోద్రెజ్ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకున్నారని, దీనికి అనుగుణంగా ఆకంపెనీకి త్వరలో భూమిని అప్పగిస్తామన్నారు. దేశంలో లక్ష మెట్రిక్ టన్నుల నూనె వినియోగం జరుగుతుండగా అందులో 97శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే ఉందని, కేవలం 3శాతం మాత్రమే మనదేశంలో పామాయిల్ సాగువుతుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 3లక్షల ఎకరాల సాగును మరో ఏడాదిలో మరో మూడు లక్షల ఎకరాలకు పెంచబోతున్నామన్నారు. ప్రస్తుతం (మిగతా 6వ పేజీలో)


ఫ్యాక్టరీ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల


ఖమ్మంలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో..

'జూబ్లీ' జోష్

- ఉప ఎన్నికలో గెలుపుతో హస్తంశ్రేణుల సంబరాలు
- బీఆర్ఎస్, బీజేపీలో నిరుత్సాహం

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : త్వరలో స్థానికసంస్థల ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం కాంగ్రెస్‌లో జోష్ నింపగా.. విపక్ష బీఆర్ఎస్, బీజేపీలో నిరుత్సాహాన్ని మిగిల్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగ్గా.. అధికార కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయకేతనం ఎగురవేశారు. దీంతో ఉమ్మడిజిల్లాలోని కాంగ్రెస్ శ్రేణుల్లో విజయానందంలో మునిగితేలారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు పార్టీ ఇన్‌చార్జ్‌లుగా ముగ్గురు మంత్రులు అక్కడే మకాం వేశారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఉపఎన్నిక ప్రకటన తర్వాత హైదరాబాదులోనే మకాం వేసి నియోజకవర్గంలో విస్తృతంగా సమావేశాలు (మిగతా 6వ పేజీలో)

మాదక ద్రవ్యాల నియంత్రణ

చట్టాలు కఠినం

- జిల్లా న్యాయాధికారి వసంత్ పాటిల్
- ముగిసిన 'డ్రగ్స్‌పై చైతన్యం' కార్యక్రమాలు.. పట్టణంలో భారీ ర్యాలీ
- జన సంద్రంలా మారిన కొత్తగూడెం ప్రకాశం మైదానం
- పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్‌పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు చట్టాలు కఠినంగా ఉన్నాయని భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుంచి కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు భద్రాద్రి జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా జిల్లాలో చేపట్టిన 'చైతన్యం - డ్రగ్స్‌పై యుద్ధం' కార్యక్రమాల ముగింపు వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో న్యాయమూర్తి మాట్లాడుతూ.. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, నేరస్తులకు విధించే శిక్షలు, న్యాయవ్యవస్థ పాత్ర (మిగతా 6వ పేజీలో)



తెగుళ్లు మిగిల్చిన కన్నీళ్లు


జూలూరుపాడు మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ట్రాక్టర్‌తో మిర్చి మొక్కలను దున్నుతున్న రైతు

చీడపీడలతో మిర్చి పంట ఆగమాగం

- ఎండిపోతున్న మొక్కలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు
- జిల్లాలో పలు చోట్ల తోటలను దున్నేస్తున్న రైతులు
- తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆవేదన

జూలూరుపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎన్నోఆశలతో మిర్చి పంట వేసిన రైతులకు తెగుళ్ల రూపంలో కన్నీళ్లే మిగిలాయి. రెండేళ్లుగా పలు రూపాల్లో నష్టాలు మూటగట్టుకున్న అన్నదాతలు.. ఈ ఏడాదైనా లాభాలు తెచ్చిపెడుతుందనే ఆశతో మిర్చి వేశారు. కానీ ఈ ఏడాదీ కష్టాలు తప్పలేదు. ఈ ఏడాది సుమారు 15వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేపట్టగా.. పూత కాత దశలో ఉన్న సమయంలో తెగుళ్ల దెబ్బతీయడంతో రోజుల వ్యవధిలోనే పంట నాశనమైంది. పంటను కాపాడుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కడం లేదు. రోజురోజుకి తెగుళ్ల బెడద అధికమవుతుండటంతో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. తెగుళ్లు సోకడంతో ఇప్పటికే జూలూరుపాడు, చంద్రుగొండ, సుజాతనగర్, టేకులపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో పలు గ్రామాల్లోని రైతులు పంటను తొలగించారు. ఒక్క జూలూరుపాడు మండలంలోనే సుమారు 800 ఎకరాల్లో మిర్చికి తెగుళ్లు ఆశించడంతో రైతులు తోటలను తొలగిస్తున్నారు.

మిర్చిని కమ్మేస్తున్న వేరుకుళ్లు తెగులు....

ఈ ఏడాది వాతావరణంలో మార్పులతోపాటు అధిక వర్షాలు పడి మిర్చి పంటను దెబ్బతీస్తున్నాయి. పంట పూత, పిందె దశలో ఉన్న సమయంలో వేరుకుళ్లు, ఆకుముడత తెగుళ్లు ఆశించడంతో మొక్కల్లో ఎదుగుదల లోపించింది. వేర్లు కుళ్లిపోయి గిడసబారి మొక్కలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కడం లేదు. రూ.వేలకు వేలు ఖర్చు చేసి పురుగుల మందులు పిచికారీ చేసినా తెగుళ్ల ఉధృతి తగ్గకపోవడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.70వేల నుంచి రూ.1.20లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. తెగుళ్ల సోకడంతో జూలూరుపాడు మండలంలోని వెంగన్నపాలెం, గుండెపుడి, అనంతారం, గంగారం తండా గ్రామాలకు చెందిన పలువురు రైతులు సాగు చేసిన పంటను తొలగించారు. మొక్కజొన్న సాగు చేపట్టేందుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు.

ఆరు ఎకరాల్లో పంటను తొలగించా

దుద్దుకూరి వెంకటేశ్వర్లు, వెంగన్నపాలెం



రెండేళ్లుగా మిర్చి సాగు చేపట్టి నష్టపోయా. ఈ ఏడాదైన ఆశాజనకంగా ఉంటుందనుకుంటే నిరాశే మిగిలింది. 8ఎకరాల్లో మిర్చి పంట వేస్తే పంటకు వేరుకుళ్ల, ఆకుముడత తెగుళ్లు ఆశించి పంట పూర్తిగా దెబ్బతింది. ఎన్ని ముందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. దీంతో ఆరెకరాల్లో పంటను తొలిగించా. రూ.5లక్షల నష్టం వాటిల్లింది.

తెగుళ్లు నిండా ముంచాయి

మాలోత్ పాపరావు, గంగారం తండా



ఈ ఏడాది ఐదెకరాల్లో మిర్చి పంట సాగు చేశా. పూత, కాపు దశలో పంటకు తెగుళ్లు సోకడంతో నష్టపోయా. తెగుళ్ల నుంచి పంటను దక్కించుకునేందుకు మందులను పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. చివరకు గత్యంతరం లేక ఐదెకరాల పంటను తొలిగించా. ఇప్పటికే రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టా.



'పిట్టతోగు'లో జాతీయ

గణాంక శాఖాధికారుల పర్యటన

పినపాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన పిట్టతోగులో జాతీయ గణాంక శాఖాధికారులు శుక్రవారం పర్యటించారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో వలస ఆదివాసీ గ్రామాల ప్రజలను పరిగణనలోకి తీసుకుని, జనగణన చేస్తున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ సుబ్బరాజు, జాయింట్ డైరెక్టర్ జ్ఞానశేఖర్ తెలిపారు. పిట్టతోగు గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వారు తమ జనగణన బృందంతో వాగు దాటి కాలినడకనే వెళ్లారు. ఇంటి గణన, జనగణనతో వలస ఆదివాసీలు సాధారణ ప్రజానీకం గణాంకాల్లోకి చేరుతారని, ప్రభుత్వ పథకాలన్నింటికి అర్హత ఉంటుందన్నారు. పలు వివరాలను తహసీల్దార్ గోపాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ అధికారులు సీహెచ్ సతీష్, హిమవర్ష, హరిత, వినయ్, తిరుపతి పాల్గొన్నారు.

రామాలయ మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష

- అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లో భేటీ
- హాజరైన రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రూపొందిస్తున్న మాస్టర్‌ప్లాన్‌పై హైదరాబాద్‌లో శుక్రవారం సమీక్ష జరిగింది. ఈ భేటీకి రాష్ట్ర రెవెన్యూ దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజరామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సమీక్షకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈవో భవానీ రామకృష్ణారావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సమయంలో దేవస్థానం అధికారులతో మాస్టర్‌ప్లాన్ రూపకల్పన ఎలా ఉండాలి? ఎంత వరకు చేయాలి? ఆర్కిటెక్ట్ రూపొందించిన ప్లాన్‌లో మార్పులు ఏమైనా చేపట్టాలా అనే అంశాలపై చర్చించినట్టు వినికిడి. ఆలయ మాస్టర్‌ప్లాన్ రూపకల్పన సమయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానికి అనుగుణంగా వైదిక సిబ్బంది సూచనలు, సలహాలకు ప్రాధాన్యమిస్తూ రూపొందించాలని నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని భావిస్తుండటంతో ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తి కాగా సుమారు ఎకరం స్థలంలో దక్షిణం వైపు అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఏఏ పనులు చేపట్టాలి అనే దానిపై అటు అధికారులు, ఇటు వైదిక సిబ్బంది తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తదనుగుణంగానే మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

నేడు బిర్సా ముండా జయంతి కార్యక్రమం

- హాజరుకానున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాలు
- గిరిజన భవన్‌లో ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పీఎం ధర్తీ అభా భగవాన్ బిర్సాముండా జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామని, శనివారం ఐటీడీఏ కార్యాలయంలోని గిరిజన భవనంలో జరిగే ఈ వేడుకలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. గిరిజన భవనంలో చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వస్తున్నారని తెలిపారు. ఈ పథకాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా మాట్లాడుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ఛాయాచిత్ర ప్రదర్శనలు, ఎంఎస్ఎంఈ యూనిట్, జీసీసీ స్టాల్, గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించి విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రత్యేక మెడికల్ క్యాంపులు, పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పీవో వెంట ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఏవో రాంబాబు, జీసీసీ డీఎం సమ్మయ్య, ఆర్సీవో అరుణకుమారి, డీఈ హరీష్ పాల్గొన్నారు.

పరిష్కారానికే ప్రాధాన్యం!

- అన్ని సమస్యలపై చర్యలు చేపడతాం
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో కమిషనర్ సుజాత
- ప్రజల నుంచి విశేష స్పందన.. వెల్లువెత్తిన ఫోన్ కాల్స్
- కార్యక్రమంలో పాల్గొన్న అన్ని విభాగాల అధికారులు


సమస్యలు వింటున్న కమిషనర్ సుజాత

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

కొత్తగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను పరిష్కరించేందుకే ప్రాధాన్యమిస్తున్నామని కమిషనర్ కె.సుజాత పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను ఆమెతో పాటు విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ఫోన్ ఇన్‌లో కమిషనర్‌కు ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఉదయం నుంచే ఫోన్ కాల్స్ వెల్లువెత్తాయి. కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో రోడ్లు, వీధి దీపాలు, డ్రెయినేజీలు, చెత్త సేకరణకు సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉన్నాయి. కుక్కలు, కోతుల బెడదపైనా ఫిర్యాదులొచ్చాయి. ఇంటి నెంబర్ల కేటాయింపు, ధ్రువపత్రాల జారీలో సమస్యలను కూడా పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. రోడ్ల ఆక్రమణలు, తాగునీటి సరఫరా గురించి కూడా ఫిర్యాదులు చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో వెలుగులోకి వచ్చిన ప్రధాన సమస్యల్లో కొన్ని..

- పైపులైన్లు తవ్వి వదిలేశారు. వర్షం పడిన సమయంలో గుంతలుపడి నీళ్లు నిలుస్తున్నాయి. మట్టి పోసి అయినా మరమ్మతులు చేయించగలరు. పోస్టాఫీసు సెంటర్ పెట్రోల్ బంకు పక్కన వార్డులో చెత్త మొత్తం అక్కడే వేస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతోంది. మోరీని ఆక్రమించి కిరాయికి ఇచ్చారు.

● మహ్మద్ రియాజ్, 30వ వార్డు, మధురబస్తీ

కమిషనర్ : పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ వారానికి ఒక్కో ప్రాంతంలో వారానికి రెండు రోజుల చొప్పున తాము తిరుగుతున్నాం. రోజుకు రెండు వార్డులలో సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ వస్తున్నాం. నీళ్ల లీకేజీకి సంబంధించి మిషన్ భగీరథ వారితో ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేశాం. 32 కి.మీ వరకు తవ్వి పైపు లైన్లు వేశాం. దానికి సంబంధించి సమస్యలు పరిష్కరించాలని చెప్పాం. పోస్టాఫీసు దగ్గర ఉన్న చెత్తకు సంబంధించి మా అధికారులను పంపించి సమస్య పరిష్కరిస్తాం.

- రెజీనా పాఠశాల నుంచి హమాలీ కాలనీ బైపాస్ రోడ్డు వరకు, శ్రీనివాస కాలనీ రోడ్డు అధ్వానంగా ఉంది.

దేవా, హమాలీకాలనీ రోడ్డు, పాల్వంచ

కమిషనర్ : కొత్త రోడ్డు శాంక్షన్ అయింది. టెండర్ కూడా పూర్తి చేస్తాం. నెల, రెండు నెలల్లో పనులు చేస్తారు. దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ వరకు ఉన్న రోడ్డు ఆర్ అండ్‌బీ పరిధిలో ఉంది. దానికి సుమారు రూ. 26 కోట్లు శాంక్షన్ అయింది. టెండరు కూడా పూర్తయింది. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తారు.

- కోతులు, కుక్కల బెడద నివారించాలి. కొబ్బరిబొండాలు దుకాణాల్లో బొండాలు కొట్టి పక్కనే పెట్టడం వల్ల దోమలు పెరిగిపోతున్నాయి. పెద్ద బజార్ సెంటర్‌లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు.

- ఆది కనకయ్య, కూలీలైన్, కొత్తగూడెం

కమిషనర్ : కుక్కలను తీసుకెళ్లి ఆపరేషన్లు చేస్తారు. కొబ్బరిబొండాలు దుకాణాలకు నోటీసులు ఇస్తాం. పెద్ద బజార్‌లో ఆక్రమణలకు సంబంధించి నోటీసులు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తాం.

- రామానంద తీర్థ కాలనీలో వాటర్ ట్యాంకు సమీపంలో రోడ్డు, కాల్వ లేదు. చాలాసార్లు వినతిపత్రం ఇచ్చాం. చెత్తను కూడా తీసుకెళ్లడంలేదు.

- కే.రాజేంద్ర ప్రసాద్, పాత పాల్వంచ

కమిషనర్: రోడ్డు శాంక్షన్ అయింది. త్వరలోనే టెండర్ పూర్తి చేస్తాం. చెత్తకు సంబంధించి మా అధికారులను పంపించి పరిశీలిస్తాం.

- విజ్ఞాన్ స్కూల్ సమీపంలో సంవత్సరం కింద సైడ్ డ్రెయిన్ తీసి వదిలేశారు. అక్కడ అంతా మురుగు నీరు నిలిచి దోమల బెడద ఎక్కువైంది.

- రామకృష్ణ, పాల్వంచ

కమిషనర్ : మీరు చెప్పిన రోడ్డు నా నోటీసులో ఉంది. కానీ అక్కడ ఒక్క ఇల్లు కూడా లేదు. డ్రెయినేజీకి సంబంధించి మా అధికారులను పంపించి క్లియర్ చేయిస్తాం.

- బాపూజీనగర్‌లో ఆంజనేయ టెంపుల్ నుంచి రోడ్డు అధ్వానంగా ఉంది. తాగు నీటి పైపులైన్లకు గుంతలు తీసి వదిలేశారు. -గులాం రబ్బాని, పాల్వంచ

కమిషనర్ : రోడ్డుకు సంబంధించి ప్రపోజల్ పెట్టిస్తాం. మంచినీటి పైపులైన్లకు సంబంధించి ఒకటి, రెండు రోజు ల్లో సమస్యను పరిష్కరిస్తాం. అధికారులను పంపిస్తాం.

- మెయిన్ హాస్పిటల్ నుంచి హెడ్ ఆఫీసు వరకు సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి. ఎన్టీఆర్ విగ్రహం వద్ద సులబ్ కాంప్లెక్స్ ఉంది కానీ మెయింటెనెన్స్ సరిగ్గా లేదు. రోడ్డు కూడా పూర్తి చేయాలి. బస్తీలో క్వార్టర్స్ మధ్యలో ఇళ్లు ఉన్నాయి. మున్సిపాలిటీ వారికి ఫిర్యాదు చేస్తే మాది కాదు అంటున్నారు.

- మహ్మద్ అస్లాం, 13 వ డివిజన్, కొత్తగూడెం

కమిషనర్ : సులభ్ కాంప్లెక్స్‌కు సంబంధించి అధికారులను పంపించి సమస్యను పరిష్కరిస్తాం. సింగరేణి వాళ్ల నుంచి రోడ్డు శాంక్షన్ చేశారు. త్వరలోనే పూర్తి చేశారు. సింగరేణికి సంబంధించిన క్వార్టర్స్‌లో వారే మెయింటెనెన్స్ చేస్తుంటారు. అది ఎవరి పరిధి కింద వస్తుందో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

- కుక్కల బెడద బాగా ఉంది. చెత్త బండి మూడు, నాలుగు రోజులకు వస్తుంది. రోడ్ల పక్కన చెత్త బాగా ఉంది.

- రామారావు, బాపూజీ నగర్.

కమిషనర్ : కుక్కలను త్వరలో పట్టిస్తాం. చెత్తకు సంబంధించి సదరు అధికారులను పంపి పరిష్కరిస్తాం. ప్రతీ వార్డులో చెత్త సేకరణకు సంబంధించి స్థానిక ఆర్పీలను కూడా వాహనం వెంబడి తిప్పడం జరుగుతుంది. మా అధికారులను పంపించి సమస్యను పరిష్కరిస్తాం.

- పాల్వంచలో ఏప్రిల్ 14 నాకు కొడుకు పుట్టాడు. కానీ బర్త్ సర్టిఫికేట్ మూడు నెలల కాలంగా తిరుగుతున్నాను.

- ప్రసాద్, పాల్వంచ

కమిషనర్ : కార్పోరేషన్‌గా ఏర్పడిన తర్వాత బర్త్ సర్టిఫికేట్‌కు సంబంధించి డేటా యాడ్ అవడానికి సమయం పట్టింది. ఆసుపత్రికి సంబంధించిన సర్టిఫికేట్లను నాకు పంపించండి. కొత్తగూడెం కార్పోరేషన్ పేరుమీద సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుంది.

- మా ఇంటి పక్కన కమ్యూనిటీ హాలు అధ్వానంగా ఉం ది. చెత్త చెదారం పెరిగి పాములు తిరుగుతున్నాయి. చిన్న పిల్లలు తిరగాలంటే భయమేస్తుంది.

- ఆర్ భవాని, పాత పాల్వంచ

కమిషనర్ : నేను మా అధికారులు పంపించి సమస్యను పరిష్కరిస్తాం. సదరు కమ్యూనిటీ హాలును అందుబాటులోకి తీసుకొస్తాం.

- చైతన్య పాఠశాల సమీపంలో మంచినీరు మూడు రో జులకొకసారి వదులుతున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి.

- ఆర్‌వీ రమణ చౌదరి, కాంట్రాక్టు కాలనీ

కమిషనర్ : సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. కుక్కల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. ఓపెన్ ప్లాట్లకు సంబంధించి మా జవాన్ వచ్చి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- నెహ్రూనగర్‌లో రిలయన్స్‌మార్ట్‌కు సమీపంలో రోడ్డు, డ్రైనేజీ వేయడం లేదు. మంచినీరు కూడా సరిగ్గా రావడం లేదు. విద్యుత్ స్తంభం సింగిల్ లైను వేశారు. - వెంపటి వెంకటేశ్వర్లు, పాల్వంచ కేటీపీఎస్.

కమిషనర్ : ఎలక్ట్రిసిటీకి సంబంధించిన విషయంపై లెటర్ ఇవ్వండి. రోడ్డుకు సంబంధించి ఇప్పటివరకు అయితే శాంక్షన్ లేదు. త్వరలో శాంక్షన్ పెట్టిస్తాం. మంచినీరుకు సంబంధించి సదరు ఆపరేటర్‌తో మా అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారు.

- ఫుట్‌పాత్‌లను ఆక్రమించి రోడ్డుపై కూరగాయాల దుకాణాలు పెడుతున్నారు. నడవడానికి కూడా కష్టంగా ఉంది.

- ఎస్ కె సర్దార్, నవభారత్, పాల్వంచ

కమిషనర్ : ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. ఒకట్రెండు రోజుల్లో మొత్తం ఆక్రమణలు తొలగిస్తాం.

- మైదానంలో మందుబాబులు, పాములు వస్తున్నాయనీ గతంలో ఫిర్యాదు ఇచ్చాం. పరిష్కరించగలరు. - ఖాజాబాషా, రామవరం ఆరో వార్డు

కమిషనర్ : సోమవారం రోజున మా సిబ్బంది తొలగిస్తారు.

- మా ఇంటిమీద నుంచి 11 కేవీ లైను ఉంది. మున్సిపాలిటీ వారు కోవిడ్ కంటే 36 లక్షలు కట్టారు. కానీ కొన్ని తొలగించి ఇప్పటి వరకు తొలగించలేదు. - మందులాల్ కోడి, కొత్తగూడెం

కమిషనర్ : దీనిపై ఒకసారి ఎన్పీడీసీఎల్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- బర్త్ సర్టిఫికేట్లు పాల్వంచలో అవ్వడం లేదు. యేడాది కాలంగా తిరుగుతున్నాం. - పాల్వంచ, రవిబాబు

కమిషనర్ : ప్రస్తుతం సర్టిఫికేట్లు అవుతున్నాయి. మీ సేవా సెంటర్‌తో కొత్తగూడెం కార్పోరేషన్ పేరుమీద దరఖాస్తు చేసుకోండి.

- కేటీపీఎస్ ఆసుపత్రి బిల్డింగుల దగ్గర కుక్కల తీవ్రత ఎక్కువగా ఉంది

- కేటీపీఎస్ కాలనీ, పాల్వంచ, కన్నెకంటి పద్మజ

కమిషనర్: వాటిని పట్టించడానికి పంపిస్తాం. సమస్యను పరిష్కరిస్తాం.

- మాకు రోడ్డు సౌకర్యం, విద్యుత్ స్తంభాలు లేవు. బస్టాండ్ నుంచి వెంకటేశ్వర హిల్స్‌కు వెళ్లే దారి శాంక్షన్ అయినప్పటికీ వేయడం లేదు.

- కే. రత్నకుమార్, వనమా కాలనీ

కమిషనర్ : మా వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను పంపించి ఎస్టిమేషన్ వేయిస్తాం. గతంలో శాంక్షన్ అయిన ఫండ్ ల్యాప్స్ అవడం వల్ల అది వేయలేదు. మరో పదిహేను రోజుల్లో రోడ్డు ప్రారంభిస్తాం. అక్కడ రోడ్డు వెడెల్పు చేసే క్రమంలో కోర్టు కేసు ఉన్నందున కాస్త లేటు అయింది. కోర్టు క్లియరెన్స్ ఉన్నంతవరకు రోడ్లు వేస్తాం.

- రెండేళ్ల క్రితం డీఎంఎఫ్ ఫండ్ కింద.. డ్రైనేజీకి రూ. 40, కమ్యూనిటీ హాలుకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. నీటి సమస్య ఉంది. బోరు మంజూరు చేయగలరు. పోల్స్ వేశారు కానీ లైట్లు ఏర్పాటు చేయలేదు.

- తంగేడు లక్ష్మణ్, 27వ వార్డు

కమిషనర్ : కమ్యూనిటీ హాలుకు సంబంధించి సింగరేణి భూమి ఉంది. వారికి రిక్వెస్ట్ పెట్టాం. ఇంకా మాకు అధికారికంగా బదలాయించలేదు. డ్రెయిన్‌కు సంబంధించి బీఎస్ఎన్ఎల్ కాంపౌండ్‌వాల్ ఉంది. దాన్ని తొలగించేందుకు ఎక్కువ బడ్జెట్ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలస్యం అవుతుంది. బోరుకు సంబంధించి మా అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారు. లైట్లకు సంబంధించి టెండర్ పెట్టడం జరిగింది. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

దేశాభివృద్ధికి బాటలు వేసిన నెహ్రూ


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి తుమ్మల

- తొలి కేంద్ర బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం
- ఖమ్మంలో నెహ్రూ జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బాటలు వేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని.. భావి భారత మార్గదర్శకులన్నారు. బాలలు అత్యంత గౌరవంగా భావించేది ఛాచా నెహ్రూ అని అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని నెహ్రూ సెంటర్‌లో మాజీ ప్రధానమంత్రి నెహ్రూ జయంతి వేడుకల్లో తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి తొలి ప్రధాని అయిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని, ఆయన దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రభాగాన నిలిపాయన్నారు. మొదటి కేంద్ర బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పించారన్నారు. ఆమేరకు దేశాభివృద్ధి జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న పిల్లలు ఉత్సాహంగా మంత్రి తుమ్మల వద్దకు చేరుకొని గులాబీ పూలను అందించారు. పిల్లలు ఏమి చదువుతున్నారని అడిగి తెలుసుకుని మంచిగా విద్యాభ్యాసం చేసి మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి తుమ్మల చిన్నారులను దీవించారు. అనంతరం నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో అన్ని కోణాల్లో దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. నెహ్రూ వారసత్వంగా ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో సకల జనుల కోసం కాంగ్రెస్ పార్టీ విశేషంగా కృషి చేస్తుందన్నారు. సమాజంలోని శ్రమ జీవుల కోసం, భారతదేశ సార్వభౌమాధికారం కాపాడేందుకు కృషి చేసిందన్నారు. అన్ని కులాలు, మతాలు అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉండేందుకు ప్రజాస్వామ్యయుతంగా పని చేసిందన్నారు. లౌకిక వాదాన్ని కాపాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, నాయకులు గజ్జల వెంకన్న, కొప్పెర ఉపేందర్, షేక్ రజ్జీ, తొగరు భాస్కర్, కాటం కోమరయ్య, యాదయ్య, ఎంఏ రామకృష్ణ, ఉప్పలయ్య, గోనేల రవిశంకర్, కన్నం రమేష్, తుపాకుల మధు, చల్లా రమేష్, బోజెడ్ల సత్యనారాయణ, పత్తికొండ శ్రీను, జాకీర్, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

- గిరిజనుల అభివృద్ధితోనే అటవీ రక్షణ సాధ్యం
- జిల్లా అటవీ సంరక్షణ కమిటీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూముల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అటవీ భూముల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గిరిజనులు పోడు నరకకుండా చూడడం అత్యవసరమని, ఇందుకోసం వారికి తగిన జీవనోపాధి అవకాశాలు కల్పించడం కీలకమని చెప్పారు. జిల్లాలో గుత్తికోయ గిరిజనుల నివాస గుంపులు, వారి జనాభా అవసరమైన సౌకర్యాలపై పూర్తి నివేదికలను సిద్ధం చేసి, ఆ నివేదిక ఆధారంగా వారికి తగిన ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అటవీ సంరక్షణ భవనాలను నిర్మించి వాటి ద్వారా గిరిజనుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గిరిజనులకు చేపల పెంపకం శిక్షణ, లైవ్లీహుడ్ షెడ్ల ఏర్పాటు వంటి జీవనోపాధి కార్యక్రమాలు చేపడితే పోడు నరికే పరిస్థితులు గణనీయంగా తగ్గుతాయన్నారు. జీవనోపాధి కల్పించిన తర్వాత కూడా ఎవరైనా పోడు నరికితే పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇప్పటికే నరికిన పోడు ప్రదేశాల్లో వెంటనే వెదురు మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో ఇప్ప చెట్ల సర్వే నిర్వహించి, రాబోయే సీజన్‌లో ఒక్క ఇప్పపువ్వు కూడా వృథా కాకుండా నెట్‌లతో సేకరించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. గుత్తికోయ యువతకు ఫర్నీచర్ తయారీ రంగంలో అవకాశాలు ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా శాఖలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు అటవీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ కోసం ఇప్పటికే తాము పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. గిరిజనుల జీవనోపాధి మెరుగుపడేలా ప్రత్యేక అభివృద్ధి ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. అటవీ భూముల రక్షణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. పోడు నరికే ఘటనలను త్వరితగతిన గుర్తించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అటవీ చట్టాల అమలులో ఇతర శాఖలతో సమన్వయం మరింత బలపడేలా పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, విద్యుత్ శాఖ అధికారి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టాలు కఠినం

(5వ పేజీ తరువాయి)

గురించి వివరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన చట్టం ఎంత కఠినంగా ఉంటుందో వివరించారు. డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం, వాడకం అనేది క్షమించరాని నేరమన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ పోలీసులకు, ప్రజలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం తరుపున డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నెల రోజుల పాటు ఎస్పీ సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పోలీసు శాఖను, చురుకుగా పాల్గొన్న యువతను, విద్యార్థులను అభినందించారు. డ్రగ్స్ సమస్య కేవలం చట్టాన్ని అమలు చేసే సమస్య కాదని, ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పెద్ద అవరోధమని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతో పాటు జిల్లాలోని విద్యాసంస్థలు, హాస్టల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానాస్పద కార్యకలాపాల గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్భయంగా అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం అనేది వ్యక్తిగత సమస్య కాదని, ఇది సామాజిక రుగ్మత అని, దీనిపై పోలీసులతో పాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో కూడా ఈ చైతన్యం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. సభలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో కిష్టాగౌడ్, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్, జిల్లా రవాణాధికారి వెంకటరమణ, కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, జిల్లా డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, సతీష్ కుమార్, మల్లయ్యస్వామి, అశోక్, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పామాయిల్ విస్తరించాలి.. పచ్చదనం పెరగాలి

(5వ పేజీ తరువాయి)

టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.20వేల వరకు ఉందని, టన్నుకు కనీస మద్దతు ధర రూ.25వేలు ఉండాలని, ఈ ధరల విషయమై త్వరలో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయమంత్రులందరం కలిసి ప్రధానికి విన్నవించబోతున్నామన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై దిగుమతి సుంకాలు తగ్గించడంతో రైతులు నష్టపోతున్నారని తద్వారా ఆయిల్‌పామ్, పత్తి గిట్టుబాటు ధరలు రైతులు కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిద్దిపేటలో 125టన్నుల సామర్థ్యంతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పూర్తిచేశామని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించబోతున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి లోపు పెద్దపల్లి, వనపర్తి, సత్తుపల్లి, ములుగు, తదితర జిల్లాలో పామాయిల్ పరిశ్రమలు పూర్తవుతాయని తెలిపారు. గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో 15నుంచి 60మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈఫ్యాక్టరీకూడా జనవరిలో ట్రయల్‌రన్ పూర్తి చేసుకుంటుందని తెలిపారు. గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో రిఫైన్డ్ ఆయిల్‌పరిశ్రమ కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గిరివికాసం కింద సోలార్‌సదుపాయంతో పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని, అటవీ, పోడుభూముల్లో పామాయిల్ సాగు చేయడం ద్వారా పచ్చదనం పెరుగుతుందని తెలిపారు. అంతర పంటలతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని, అకాలవర్షాలు, రాళ్లవానలు, చీడపీడలు, కోతులు, అడవి పందులతో ఈపంటకు నష్టం ఉండదని ఆయన వివరించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్, జేడీఏ పుల్లయ్య, ఆర్డీవో నరసింహారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు. ఇక శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 'జూబ్లీ' జోష్

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ప్రచారాన్ని వ్యూహాత్మకంగా నిర్వహించారు. ఇక ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు కార్పొరేషన్ల చైర్మన్లు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కూడా ప్రచారం ముగింపులో పాలుపంచుకున్నారు. అక్కడ కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో జిల్లాలో ని కాంగ్రెస్ వర్గాలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఖమ్మంతోపాటు అన్ని మండల కేంద్రాల్లోనూ కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మిఠాయిలు పంచుకున్నారు. ఇక ఈ ఉపఎన్నికపై ఎన్నో ఆశలు పెట్టుకున్న బీఆర్ఎస్‌కు తీవ్ర నిరాశే మిగిలింది. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌మార్, ఎంపీ వద్దిరాజురవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్‌తోపాటు పలువురు ప్రచారంలో పాలుపంచుకున్నారు ఈ ఎన్నికల్లో గెలుపు ద్వారా జిల్లాలోనూ కేడర్‌కు బలమైన సంకేతం ఇవ్వొచ్చని భావించినా అది ఫలించలేదు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి హైదరాబాద్‌లోనూ మంచి పట్టు ఉంది. కానీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం కేడర్‌కు మింగుడు పడటం లేదు. ఆ పార్టీకి బిహార్ ఫలితాలు ఉత్సాహం నింపినా జూబ్లీహిల్స్‌లో చతికిలపడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఎన్డీయే కూటమిగా అభ్యర్థిని నిలిపి ఉంటే ఆశించిన ఓట్లు వచ్చేవన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారికి జన్మదిన శుభాకాంక్షలు

ఏజెన్సీ తలరాత మార్చిన తుమ్మల


భద్రాద్రికి శ్రీరామరక్షగా నిలుస్తున్న కరకట్ట


పూసూరు ఏటూరు నాగారం మధ్య నిర్మించిన గోదావరి వారధి

- భద్రాద్రికి రక్షణ కవచంగా నిలుస్తున్న కరకట్ట
- అటు శబరి, ఇటు తాలిపేరుపై వారధులు తుమ్మల చలవే
- ఆయన హయాంలోనే అభివృద్ధిలో ఏజెన్సీ పరుగులు

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి ఏజెన్సీ తలరాతను మార్చిన మరో విధాత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. గత నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో రాజకీయాలకు అతీతంగా భద్రాద్రి ఏజెన్సీని అభివృద్ధి చేసి తన మార్కును చాటుకున్నారు. ముఖ్యంగా దశాబ్దాల కాలంగా ముంపునకు గురవుతున్న భద్రాద్రి పుణ్యక్షేత్రాన్ని వరద ముంపు నుంచి కాపాడేందుకు గోదావరి కరకట్ట నిర్మాణంకు దోహదపడ్డారు. దీంతో 2022 జూలై 16న వచ్చిన మహా గోదావరి వరదల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71.3 అడుగులు వచ్చినా భద్రాద్రికి గోదావరి కరకట్ట రక్షణ గోడగా నిలిచిందని భద్రాద్రి వాసులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. అలాగే నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మమేకమై ఉన్న కూనవరం- వరరామచంద్రాపురం కలుపుతూ వారధిగా ఉన్న శబరి బ్రిడ్జిని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాదు చర్ల మండలంలో తాలిపేరు వద్ద వారధి నిర్మించడంతో ఏజెన్సీ వాసుల కష్టాలు తొలగాయి. అలాగే వాజేడు మండలంలో పూసూరు వారధి నిర్మాణం చేయడంతో నేడు వాజేడు, వెంకటాపురం మండలాలకు మహర్దశ పట్టింది. ఈ విధంగా భద్రాచలం ఏజెన్సీలో మౌలిక విద్య, వైద్య సదుపాయాలు, వసతులు, రహదారులు, వారధులు ఇలా ఒకటేంటి ఎన్నో ఎన్నింటికో శ్రీకారం చుట్టి నిర్మించి ఏజెన్సీ ప్రాంతవాసుల గుండెల్లో చిరస్థాయిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిలిచిపోయారు.

భద్రాచలం అభివృద్ధి తుమ్మల చలవే..

భద్రాద్రి అభివృద్ధి జరిగిందంటే అది మంత్రి తుమ్మల చలవే. రామాలయ అభివృద్ధి, వరదల ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం భద్రాద్రికి వరద కరకట్ట నిర్మాణం, వంద పడకల ఆసుపత్రి, పట్టణంలో మంచినీటి సదుపాయం, రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు లాంటివి చేశారు. తుమ్మల సంకల్పంతోనే భద్రాద్రి వద్ద రెండో వారధికి బీజం పడగా రెండేళ్ల క్రితం శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా తరలొచ్చే భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఆ వారధులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

గతంలో భద్రాచలం ఏజెన్సీలో రాకపోకలు సాగించాలంటే వరదల సమయంలో కష్టాలు, నష్టాలు అన్నీ ఇన్నీ కావు. నాడు 1997లో గోదావరి వరదల సమయంలో చర్ల మండలం తేగడ వద్ద తాలిపేరు నుంచి వదిలిన వరద నీటిలో పడవ మునగడంతో 23 మంది మృత్యువాతపడ్డారు. ఈ సంఘటన ఆనాడు మంత్రి తుమ్మలను కలిచివేసింది. ప్రతి ఏటా వర్షాకాలం వరదల సమయంలో ప్రజలు ముఖ్యంగా ఎగువన ఉన్న చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడేవారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఎన్నో వారధులకు శ్రీకారం చుట్టి వాటిని పూర్తి చేసిన ఘనత ఆయనదే. ఇదిలా ఉండగా.. వాజేడు మండలంలోని పూసూరు- ఏటూర్నాగారం మండలంలోని ముల్లెకట్లను కలుపుతూ గోదావరిపై నిర్మించిన వారధి ఏజెన్సీవాసులకు వరమైంది. అలాగే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం సాగించేందుకు కల్లేరు-మోటు మధ్య బ్రిడ్జి నిర్మాణానికి నాడు తుమ్మల నాగేశ్వరరావు ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడడంతో.. ఆ ప్రయత్నం సత్ఫలితాలనిచ్చింది.



ఆంధ్రజ్యోతి BHADRADRI KOTTAGUDEM ZONE
శనివారం 15 నవంబరు 2025
భద్రాద్రి కొత్తగూడెం
● కొత్తగూడెం ● భద్రాచలం ● పినపాక ● అశ్వారావుపేట ● ఇల్లెందు

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన భట్టుపల్లి

కరకగూడెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) భట్టుపల్లి అయ్యప్ప పడిపూజలో అయ్యప్ప నామస్మరణ, కీర్తనలతో గురువారం రాత్రి మార్మోగింది. కరకగూడెం మండలం, భట్టుపల్లి గ్రామానికి చెందిన నాగేష్ ఇంట్లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన పడి మహోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గురుస్వాములు మధు, శ్రీను, కమలాకర్, శ్రీను, భిక్షపతి, సోమిరెడ్డి, రమణ, సాయి, శ్రీకాంత్, ప్రసాద్ భక్తులు పాల్గొన్నారు.


పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ఉద్యానపంటలపై అవగాహన ఉండాలి

అశ్వారావుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలు, వాటిలో వేసే అంతర పంటలు, భూసార పరీక్షలు, విత్తన ఎంపిక, ఆధునిక అంశాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవడం ద్వార లాభాలను పొందవచ్చునని అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా. విజయకృష్ణ వివరించారు. శుక్రవారం మండల పరిధిలోని అచుతాపురం, నారంవారిగూడెంలలో శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం, మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, ఉద్యాన ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో మోజర్ల ఉద్యాన కళాశాల అధ్యాపకులు భాస్కర్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

రేపు కమ్మవారి వన భోజనాలు

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతా రామ కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాజుపేటలోని పాకాల దుర్గాప్రసాద్ తోటలో కార్తీకమాస వన భోజనాలు నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని కమ్మవారందరూ కుటుంబ సభ్యులతో సకాలంలో హాజరవ్వాలని వారు కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

జూలూరుపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆరోపించారు. శుక్రవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణాలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచకుని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఆపార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందుటౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటి నుంచి సొంతింటికి బయల్దేరిన మహిళ అదృశ్యమైన సంఘటన శుక్రవారం ఇల్లెందులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ సురేశ్ కథనం ప్రకారం ఖమ్మం పట్టణంలో నివాసం ఉంటున్న ఇమ్మడి సంధ్యరాణి ఇల్లెందు మండలంలోని మర్రిగూడేనికి తమ సమీప బంధువుల ఇంటికి ఈనెల 11న వచ్చింది. తిరిగి 12న ఖమ్మం వెళ్లతున్నానని చెప్పి బంధువుల ఇంటి నుంచి బయల్దేరినప్పటికీ ఖమ్మంలోని తన సొంతింటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు మూడు రోజులుగా వెతికారు. ఎక్కడ సంధ్యారాణి అచూకి లభ్యం కాకపోవడంతో శుక్రవారం రాత్రి ఇల్లెందు పోలీసులకు సంధ్యారాణి తల్లీ జానకమ్మ ఫిర్యాదు చేయడంతో ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

బాలలతో పనులు చేయిస్తే కఠినచర్యలు

ఇల్లెందుటౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలతో పనులు చేయిస్తే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని ఇల్లెందు కోర్టు న్యాయాధికారి దేవరపల్లి కీర్తీచంద్రికరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఎస్సీ బాలికల హస్టల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ బాలలను కిరాణ షాపులు, హోటళ్లు, కర్మగారంలో పనుల్లో పెడితే శిక్షలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. నేటిబాలలే రేపటి పౌరులుగా బావించి బావిభారత పౌరులను ఆదరించి సహాయసహకారాలు అందించాలని కోరారు. అనంతరం బాలలకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, హస్టల్ సంక్షేమాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విలువిద్యకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు

పాల్వంచ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విలువిద్యకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు భద్రాచలం డిప్యూటీ డైరెక్టర్ అశోక్ చెప్పారు. శుక్రవారం మండలంలోని కిన్నెరసాని గిరిజన స్పోర్ట్స్ స్కూల్లో ఆర్చరీ సెలక్షన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన్యంలోని గిరిజన విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లాలో విలువిద్య శిక్షణను ఇప్పించనున్నట్లు చెప్పారు. అన్ని క్రీడలతో పాటు విద్యార్థులు విలువిద్యపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన పాఠశాలలో ఎక్కువ మంది విలువిద్య క్రీడాకారులు ఉన్నారని అన్నారు. జాతీయ స్థాయిలో కూడా మెడల్స్ సాధించిన క్రీడాకారులతో ఇక్కడ శిక్షణకు ఏర్పాటు చేపిస్తున్నామన్నారు. ఈ సెలక్షన్స్‌లో ప్రతిభను చూపిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు, ఆర్చరీ అసోసియేషన్ జాతీయ మెంబర్ పుట్టా శంకరయ్య, ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యుగెందర్‌రెడ్డి, ఏటీడీఓ చంద్రమోహన్, ఏఎస్ఓ వెంకటనారాయణ, శంకర్, పీడీ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కార్మికులకు స్వెట్టర్ల అందజేత

చర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) చర్ల మండలంలోని గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా చర్ల పంచాయతీలో పని చేస్తున్న కార్మికులను గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్ల ఎంఈవో పరిటాల రమణ పాల్గొని మాట్లాడారు. బాలల దినోత్సవం నాడు కార్మికులను సన్మానించాలనే ఆలోచన విద్యార్థులకు రావడం సంతోష కరమన్నారు. పాఠశాల హెచ్ఎం హెచ్‌జీవీ ప్రసాద్, చర్ల పంచాయతీ సెక్రటరీ తోకల సురేష్, ఎంవీ సుబ్రమణ్యం, జి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌పై దాడిఘటనలో పదేళ్ల జైలు

కొత్తగూడెం లీగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమాన విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి కె. కిరణ్ కుమార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 నవంబరు 26న పోలీసుస్టేషన్‌పై దాడి ఘటనలో శిక్ష పడింది.కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారం రాజారావు వాదించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ డి. రాఘవయ్య, లైజన్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్, పీసీ జరుపుల రవి సహకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దుమ్ముగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సరిహద్దు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కొత్తూరుకు చెందిన యువకుడు మడకం శైలేష్(15) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శైలేష్ ఈనెల 10న ద్విచక్రవాహనంపై దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం కిరాణా దుకాణానికి వచ్చి సామగ్రి కొనుగోలు చేశాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బైరాగులపాడు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. తీవ్రగాయాలైన శైలేష్‌ను తొలుత భద్రాచలం ఆసుపత్రిలో చికిత్సల అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సురేష్‌బాబు

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన కవి, కవిరత్న తోటమల్ల సురేష్‌బాబును శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కోఆర్డినేటరుగా నియమిస్తూ శుక్రవారం శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డా.కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణంలు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం పట్ల పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు దనికొండ శ్రీనివాసరావు, కేవీ రమణ, బి.కృష్ణలు హర్షం వ్యక్తం చేశారు.



ఘనంగా బాలల దినోత్సవం

మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని అన్ని పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలు పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషాధారణ గావించారు.


భద్రాచలం లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో..


లక్ష్మీదేవిపల్లి మండలంలో విద్యార్థులతో పీవో



మణుగూరులో...


బూర్గంపాడులో మాట్లాడుతున్న డీఈవో

జూబ్లీహిల్స్ విజయంతో కాంగ్రెస్ సంబురాలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపును స్వాగతిస్తూ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.



భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో , కొత్తగూడెం డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ సంబురాలు


ఇల్లెందులో..


అశ్వాపురంలో..

బాలికలు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ

పాల్వంచ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికలు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ అన్నారు. శుక్రవారం పాల్వంచ శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో బాలికలు రాణించి దేశానికి మంచి పతకాలు సాధించాలని సూచించారు. అనంతరం డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ పరంధామరెడ్డి విజేతలకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ మహిధర్, చీఫ్ కోచ్ నాగేంద్ర, ఎర్రయ్య, మల్లిఖార్జున్, నవ్య, రాణి, రాజేశ్వరి, సోమరాజు, పవన్, అక్బర్, టీడీపీ నాయకులు కనగాల అనంతరాములు పాల్గొన్నారు.

విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడాలి

ఐటీడీఏ పీవో రాహుల్

లక్ష్మీదేవిపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన సాధ్యమని విద్యార్థుల తల్లిదండ్రులకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం, ఎదురుగడ్డ పంచాయతీలోని పృధ్విరాజ్‌నగర్ గిరిజన సంక్షేమ ప్రాథమికోన్నత పాఠశాలను పీఓ సందర్శించారు. విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలు, ఉద్దీపకం కార్యక్రమం అమలు, ఉపాధ్యాయుల బోధన తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పీఓ రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాలలకు గైర్హాజరుకాకుండా వారి తల్లిందండ్రులు చూడాలన్నారు. డిసెంబరులో ప్రథమ్ ఎన్‌జీఓలతో ఉద్దీపకం-2 ఫైనల్ టెస్ట్ నిర్వహించి ఫలితాలను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి స్ఫూర్తిగా నిలువలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ షరీఫ్ కన్నుమూత

అంతర్జాతీయస్థాయిలో పలుమార్లు దక్కిన అవార్డులు

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్ఎ షరీఫ్ (52) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. భద్రాచలంలో క్లాసిక్ షరీఫ్‌గా పేరుగాంచిన ఆయన భద్రాచలం ఏజెన్సీ అందాలను ఎన్నో వేదికలపై తన ఫోటోగ్రఫీ నైపుణ్యం ద్వారా ప్రదర్శించి అవార్డులు, రివార్డులు పొందారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో, విభజన అనంతరం ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్ఎ షరీఫ్‌ను అవార్డులు, రివార్డులతో సన్మానించాయి. ఫొటోగ్రాఫర్లు, మిత్రులు సంతాపం వ్యక్తంచేశారు.


షరీఫ్ (ఫైల్)

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ముగ్గురు యువకులకు గాయాలు

జూలూరుపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని సాయిరాం తండా గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని గొల్లగూడేనికి చెందిన అన్నదమ్ములు ఎర్రిబోయిన వీరబాబు, ఎర్రిబోయిన వెంకటకిట్టయ్య, టాక్యా తండాకు చెందిన గుగులోత్ గోవర్ధన్‌లు కలసి జూలూరుపాడులో దుకాణంలో పురుగుమందులను తీసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బేతాళపాడు వెళుతున్నారు. ఈ క్రమంలో మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జూలూరుపాడు నుంచి మణుగూరు వైపు వెళ్త సాయిరాం తండా గ్రామ సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురి యువకులకు గాయాలయ్యాయి. వారికి వైద్య చికిత్సలను అందించేందుకు స్థానికులు ప్రైవేట్ వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలను నమోదు చేసుకుని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


గాయపడిన వీరబాబు

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్/చుంచుపల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రిని బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకై వందరోజుల ప్రచార ఉద్యమ పోస్టర్‌ను ఆయన తన చాంబర్లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని తెలంగాణ లక్ష్యంలో భాగంగా భద్రాద్రి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తెలంగాణలో కీర్తికెక్కేలా అధికారులు స్వచ్ఛంద సంస్థలు జిల్లా ప్రజలు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ కో ఆర్డినేటర్ వి. రాజేష్, టీం సభ్యులు మాన్సింగ్, జ్యోతి, మోహన్, మౌనిక పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకే..

చుంచుపల్లి: జ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకే గ్రంథాలయాలు దోహదపడతాయని కలెక్టర్ జితేష్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా చైర్మన్ పసుపులేటి వీరబాబుతో కలిసి మొదటి రోజు నెహ్రూ, ఎస్ఆర్.రంగనాథన్‌ల చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతిని వెలిగించి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటర్నెట్ , వైఫైలు కంటే పుస్తక జ్ఞానం అనేది ఎంతో ముఖ్యమని, పుస్తకాల ద్వారానే విజ్ఞానం దొరుకుతుందన్నారు. గ్రంథాలయ మౌలిక సదుపాయాల కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని, గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు బాధ్యత వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, గ్రంథపాలకురాలు జి.మణిమృదుల, శాఖ గ్రంథ పాలకులు మధుబాబు, వాణి, జానీ, రుక్మిణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

తల్లిదండ్రులు పిల్లలకు సమయం ఇవ్వాలి

డీఈవో నాగలక్ష్మీ

బూర్గంపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మనోవికాసానికి, మంచి సామాజిక సంబంధాలకు, విద్యలో రాణించడానికి, మానవతా విలువల అభివృద్ధి కొరకు తల్లిండ్రులు పిల్లలకు సరైన సమయం ఇవ్వాలని డీఈవో నాగలక్ష్మీ కోరారు. శుక్రవారం బాల దినోత్సవం పురస్కరించుకుని సారపాకలోని జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల తల్లితండ్రుల అభిప్రాయాలు విని పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ గొప్పతనాన్ని వర్ణిస్తూ నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో యదుసింహ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దూదా, ఉపాధ్యాయులు సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పనులను పూర్తి చేయాలి: ఎమ్మెల్యే

దమ్మపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దమ్మపేటలో నిర్మాణంలో ఉన్న డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదేశించారు. డివైడర్ పనులను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే పరిశీలించారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను నాణ్యంగా త్వరగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అంతకు ముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ విజయం సాధించటం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నంశెట్టి యుగంధర్, కేవి సత్యనారాయణ,మార్కెట్‌కమిటి చైర్‌పర్సన్ వాసం రాణి, కక్కిరాల రమేష్, ఎర్రా వసంత రావు, ఎర్రగొర్ల రాదాకృష్ణ, జూపల్లి ఉపేంద్రబాబు, గోపిశాస్త్రి, పగడాల రాంబాబు, గోపి, రాంబాబు, వాసం శ్రీను తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

జూలూరుపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్‌అన్నారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన రికార్డులు, రిజిస్టర్లు, మందల నిల్వలను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ ఆసుపత్రిలో లేకపోవడంతో వైద్యురాలుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆసుపత్రిలో ఉండి ప్రజలకు సేవలను అందించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఆలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచే ఆసుపత్రిలో అందుబాటులో ఉంటు పరీక్షలు చేయాలన్నారు. కాన్పుల శాతాన్ని పెంచేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు తేజస్విని, సిబ్బంది వెంకటేశ్వర్లు, సుకుమారి తదితరులు పాల్గొన్నారు.


ఎంఈవోపై ఉపాధ్యాయుడి దాడి

అటెండెన్స్‌లో షీట్‌లో సంతకం పెట్టడంపై ప్రశ్నించిన ఎంఈవో

ఆగ్రహంతో కర్రతో దాడి చేసిన ఉపాధ్యాయుడు

పోలీసులకు ఫిర్యాదు.. ఇల్లెందులో ఘటన

ఇల్లెందు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అటెండెన్స్ షీట్‌లో సంతకం విషయమై ప్రశ్నించాడన్న కోపంతో ఓ ఉపాధ్యాయుడు ఎంఈవోపై కర్రతో దాడిచేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఇస్లావత్ శంకర్ నిబంధనలకు విరుద్ధంగా అటెండెన్స్ రిజిస్టర్‌లో మధ్యాహ్నం పెట్టాల్సిన సంతకం ఉదయాన్నే పెట్టాడు. దానిని గమనించిన ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇల్లెందు ఇన్‌చార్జ్ ఎంఈవో ఉమాశంకర్ ప్రశ్నించాడు. ఇష్టారీతిన సంతకం పెట్టడం సరికాదని మందలించాడు. దీంతో ఆగ్రహించిన ఉపాధ్యాయుడు ఇస్లావత్ శంకర్ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ తన చేతిలో ఉన్న కర్రతో ఎంఈవో ఉమాశంకర్‌పై దాడి చేసి గాయపరిచాడు. ఇది గమనించిన పాఠశాల ఇతర ఉపాధ్యాయులు దాడిని అడ్డుకుని ఇద్దరినీ సముదాయించి.. గాయపడిన ఎంఈవో ఉమశంకర్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఎంఈవో ఉమాశంకర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉపాధ్యాయుడు శంకర్‌పై కేసు నమోదు చేశామని ఇల్లెందు సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు.


గాయపడిన ఎంఈవో

ఎంఈవోపై దాడి హేయం

ఇల్లెందుటౌన్: ఇల్లెందు ఎంఈవో ఉమాశంకర్‌పై ఉపాధ్యాయుడు శంకర్ దాడీ చేయడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు శుక్రవారం ఇల్లెందులో బీసీ సంఘాల నాయకులు ప్రకటనలు విడుదల చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

అశ్వాపురం నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొందిగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. స్థానికంగా ఇటుకబట్టీలలో పనిచేస్తు న్న ఒడిస్సా రాష్ట్రం రాజ్‌పూర్ గ్రా మానికి చెందిన జిత్తూ(18) కూ లీలను తీసుకువచ్చేందుకు ట్రాక్ట ర్‌పై గొందిగూడెంకు బయ లుదేరాడు. మార్గమధ్యలో అతి వేగంతో ఉన్న ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న గోతిలో పల్టీ కొట్టింది. జిత్తూపై ట్రాక్టర్ ఇంజన్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అశ్వాపురం ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్ ఇంజన్‌ను తొలగించి మృతుడు జిత్తూను వెలికి తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కోరం

టేకులపల్లి/ఇల్లెందురూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బోడు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్ రావు, ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, తహసీల్దార్ వీరభద్రం, జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబు రావు, ఏడీఏ లాల్‌చంద్, ఏవో అన్నపూర్ణ, పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం

చేప పిల్లలు వదిలిన ఎమ్మెల్యే

ఇల్లెందురూరల్:మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేసి మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయుతనందిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.శుక్రవారం ఇల్లెందు మండలం చల్లసముద్రం ఉమ్మడి పంచాయతీలో ఉన్న చెరువులలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలను ఎమ్మెల్యే కోరం కనకయ్య చెరువుల్లో వదిలారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు,సాంబమూర్తి జిల్లా మత్స్యశాఖాదికారి ఇంతీయాజ్ అహ్మద్, నూరుద్దిన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

టేకులపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాల, రాంపురం పంచాయతీ హరిజనవాడ ప్రాథ మిక పాఠశాలలను సందర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలల్లో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ.. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దన్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసే సమావేశాలకు తల్లిదండ్రులు హాజరై విద్యార్థులు ఎలా చదువుతున్నారనే విషయాలను తెలుసుకోవాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్.. పిల్లల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరోజా, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉమా, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం టేకులపల్లి సంత ప్రాంతంలో స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కాంప్లెక్స్‌ను త్వరతిగతిన పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బైరు మల్లేశ్వరి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య పాల్గొన్నారు.